
సాక్షి
బాపట్ల
సోమవారం, 10, జూన్, 2024



మరకత లింగానికి అభిషేకాలు

ఫిరంగిపురం: వేమవరం కోటి లింగాల క్షేత్రంలోని మరకత లింగానికి ఆదివారం భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

వీరాంజనేయునికి పూజలు



ఫిరంగిపురం: వీరాంజనేయ స్వామి గుడి ఆలయ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

పట్నంబజార్: ఈనెల 17న బక్రీదు పండుగను పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీమ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం లారీ అసోసియేషన్ నేతలకు ఈ అంశంపై పలు సూచనలు చేశారు. గోవుల అక్రమ రవాణా చేపట్టిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. పాలిచ్చే గేదెలు, నిషిద్ధ పశువుల గోవధకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వాహనాల్లో పశువులు తరలించే వారు ఏపీఎంవీ యాక్ట్ 253 రూల్ ప్రకారం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకుని తరలించాలని తెలిపారు.

నేటి నుంచి మిర్చి యార్డులో క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి యథావిధిగా మిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, హమాలీల అభ్యర్థన మేరకు మే నెల 11 నుంచి జూన్ 9 వరకు యార్డుకు సెలవులు ప్రకటించినట్టు వివరించారు. సుమారు నెల రోజుల అనంతరం యార్డులో క్రయవిక్రయాలకు అనుమతిచ్చినట్లు వెల్లడించారు. మిర్చి రైతులు తమ సరుకును ఆదివారం అర్ధరాత్రి నుంచి మిర్చి యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

సమ్మర్ క్రీడా సాధన ఎంతో ఉపయోగం

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి



గుంటూరు వెస్ట్(క్రీడలు): సమ్మర్ క్రీడా సాధన చిన్నారులకు ఎంతో ముఖ్యమని వాటిని తల్లిదండ్రులు నిరంతరం ప్రోత్సహించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో స్కేటింగ్ కోచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తూ చిన్నారులను నిరంతరం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పోటీల నిర్వాహక కార్యదర్శి షేక్ ఖాజా మాట్లాడుతూ పోటీలో దాదాపు 200 మంది చిన్నారులు పాల్గొన్నారని వివరించారు. అనంతరం నరసింహారెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

13న మహా కుంభాభిషేకం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 13వ తేదీ మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అందులో భాగంగా ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్షా స్వీకరణ, వాస్తు హోమం, అంకురారోపణ ఉంటుందని తెలిపారు. 11వ తేదీ మంగళవారం ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, అగ్ని ప్రణయనం, రుద్రాభిషేకం, ప్రధాన హోమాలు ఉంటాయని, రాత్రికి సర్వతోభద్ర మండప ఆవాహన కలశస్థాపన ఉంటుందని చెప్పారు. 12వ తేదీ బుధవారం ఉదయం 8.10 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, రాత్రికి మహాశాంతి హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13వ తేదీ గురువారం ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, 9.18 గంటలకు ఆలయ శిఖరాన మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, స్వామివారి శాంతి కల్యాణం, అనంతరం అన్న సమారాధన ఉంటాయని వివరించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద పంపిణీ ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

కార్తికేయుని గుడిలో రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. క్యూలైన్లన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అలలపై కోలాహలం

- రెండురోజుల్లో వేసవి సెలవులు పూర్తి
- ఆదివారం కావడంతో తీరానికి పోటెత్తిన పర్యాటకులు
- 1.50 లక్షల మంది తరలివచ్చినట్టు అంచనా

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీరం ఆదివారం జనసంద్రమైంది. పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. రెండురోజుల్లో వేసవి సెలవులు ముగియనుండడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుదూరప్రాంతాల నుంచి 1.50 లక్షల మంది సందర్శకులు పోటెత్తినట్టు అంచనా. పర్యాటకులు రోజంతా అలలపై కేరింతలు కొట్టారు. మహిళలు తెల్లవారుజామున తీరం ఒడ్డున పసుపు, కుంకుమ, ఐదు రకాల పూలు, పండ్లతో గౌరీదేవి పూజలు నిర్వహించారు. సముద్రస్నానాలాచరించారు. తీరం వెంబడి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్ట బందోబస్తు చేపట్టారు. పర్యాటకులు పోటెత్తడంతో వాహనాలతో పార్కింగ్ స్థలం కిక్కిరిసింది. దీంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. పర్యాటకులు తీరంలోని బాల శివాలయం, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలతో బందోబస్తు నిర్వహించారు. కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయి తీరంలో తిరుగుతున్న చిన్నారులను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆరు బోట్లతో గస్తీ చేపట్టారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

తీరంలో పర్యాటకుల సందడి



సూర్యలంక తీరంలో సముద్రస్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు



పార్కింగ్ ప్రదేశంలో కిక్కిరిసిన వాహనాలు



సూర్యలంక తీరంలో పర్యాటకులు విహరించడానికి సిద్ధంగా ఉన్న ఒంటెలు

సూర్యలంక తీరం ఆహ్లాదకరం



ఐదేళ్ల క్రితం సూర్యలంక సముద్రతీరానికి కుటుంబ సమేతంగా వచ్చి స్నానాలు ఆచరించాం. ఇప్పుడు వసతులు పెరిగాయి. ఆహ్లాదంగా ఉంది. స్వచ్ఛమైన నీటిలో స్నానం చేయడం మధురానుభూతి. చిన్నపిల్లలు, కుటుంబ సభ్యులతో తీరం వెంబడి సేద తీరేందుకు బెడ్‌లు ఏర్పాటుచేయటం బాగుంది. పూజలకూ అనువైన వాతావరణం ఉంది. – జి.శ్రీనివాసరావు, స్నేహలత కుటుంబ సభ్యులు, హైదరాబాద్

సూర్యలంక సందర్శన మధురానుభూతి



నేను సూర్యలంక సముద్రతీరానికి రావడం ఇదే మొదటిసారి. తీరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలతో ఆనందంగా గడిపా. చాలా సంతోషంగా ఉంది. స్వచ్ఛమైన నీరు, అలల హోరు ఆహ్లాదాన్ని పంచింది. తీరం వెంబడి మోటార్ వాహనాలు, గుర్రాలు, ఒంటెల స్వారీలు పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. – స్వాతి, ఖమ్మం జిల్లా

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కమిటీ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం పార్టీ చేస్తున్న విధ్వంసకాండను వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, లీగల్ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం లీగల్ విభాగం ఆధ్వర్యంలో సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రజలు టీడీపీకి అధికారం కట్టబెడితే ఆ పార్టీ ఎన్నికల హామీలను ఏ విధంగా అమలు చేయాలో ఆలోచన చేయకుండా, ఘర్షణలు, భౌతిక దాడుల ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసే దురహంకారంతో వ్యవహరించటం సరికాదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా నిలబడటంతో పాటు వారికి న్యాయసహాయం అందించేందుకు పార్టీ లీగల్ సెల్ న్యాయవాదుల కమిటీ పనిచేయబోతోందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి కమిటీలు ఏర్పాటు చేస్తామని, ముందుగా అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలబడేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ఇబ్బంది కలిగితే కార్యకర్తలు వెంటనే ఈ దిగువ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. లీగల్‌సెల్‌లో మహిళా కమిటీ కూడా ఏర్పాటు చేశామని వివరించారు. రోళ్ళ మాధవి, టి.రాజ్యలక్ష్మి, మాతంగి మాధవి, మోర్ల బాలసుందరి, చల్లపల్లి సౌజన్య, కొమ్ము సోనియా మహిళా కమిటీలో ఉంటారని వెల్లడించారు. న్యాయవాదులు కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటారని వివరించారు.

పేరు	ఫోన్ నంబర్
పోలూరి వెంకటరెడ్డి	9177650767
సీడీ భగవాన్	9440214578
అబ్రహాంలింకన్	9848520144
సయ్యద్‌బాబు	9985179494
పోకల వెంకటేశ్వర్లు	9866339147
కేఎస్‌టీ సింగ్	9848684277
మేకా రవి	9951023777
ఎస్.సుధాకర్‌రెడ్డి	9848220505
కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి	9848361788
వేముల ప్రసాద్	8977308260
బి.శ్రీనివాస్‌యాదవ్	9866003212
పిల్లి శ్యామ్	9849821361
యేటి కోటేశ్వరరావు	8639631618
మీనిగ శ్రీను	8008619383
కడియాల శ్రీరాములు	9848560442
జి.వెంకటరమణ	7981926431
పచ్చల అనిల్	9502025253
పి.కుమార్‌రాజా	9441265527
పిల్లుట్ల బాబూరావు	9505789211
నెల్సన్	9393498761
మొండితోక శ్రీనివాసరావు	9492084262
ఎస్‌వి కృష్ణంరాజు	9052264799
కట్టా సుధాకర్	9885826527
నరసింహం	9502120971
మహిళా కమిటీ	9441084879

హనుమనామ స్మరణ భక్తకోటికి కొండంత అండ

హనుమాన్‌జంక్షన్ రూరల్: అంజనీపుత్రుడైన హనుమాన్‌ను స్మరించటం వల్ల సకల కష్టాలు తొలగిపోతాయని, భక్తుల మనోవాంఛ ఫలిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలోలో ఆదివారం సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం జరిగింది. హనుమంతుడు బలశాలి మాత్రమే కాదని ఎంతో జ్ఞానశాలి అని చెప్పారు. తొలుత ఆయన అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు చాగంటి కోటేశ్వరరావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

- వేసవి సెలవులు ముగియనుండటంతో రికార్డు స్థాయిలో దర్శనాలు
- సర్వ దర్శనానికి మూడు గంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగియనుండటంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాధారణంగా సెలవు రోజులలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 70 వేల మంది అమ్మవారిని దర్శించుకునే వీలుంది. అయితే ఆదివారం తెల్లవారుజామున 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపే ఆ సంఖ్యకు దాటేసింది. భక్తుల తాకిడితో అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. మహా మండపంలో మెట్లు, లిఫ్టు ద్వారా కొండపైకి చేరుకున్న భక్తుల క్యూ 5వ అంతస్తు వరకు చేరింది. ఇక ఘాట్‌రోడ్డు వైపున ఓం టర్నింగ్ వరకు చేరింది. దీంత భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కేఎస్ రామరావు అధికారులు అప్రమత్తం చేశారు. 5 అంచల కంపార్టుమెంట్ విధానంతో క్యూలైన్లలో రద్దీని నియంత్రిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఇక రైల్వే స్టేషన్, బస్టాండ్‌లతో పాటు కొండ దిగువన దుర్గాఘాట్ నుంచి కొండపైకి నడిచే బస్సులలో భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. సర్వదర్శనం క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునే వారికి మూడు గంటల సమయం పట్టింది. మరో వైపున వీఐపీల పేరిట వచ్చే వారిని టికెట్ ఉంటేనే రూ. 500 క్యూలైన్‌లోకి అనుమతించారు. సీఎం గేట్‌తో పాటు ఆలయం దక్షిణ వైపు గేట్లకు తాళాలు వేసి రద్దీని నియంత్రించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఏఈవో ఎన్. రమేష్ బాబు, ఇతర అధికారులు రద్దీని నియంత్రిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. అమ్మవారిని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

కొండ దిగువన బారులు తీరిన కార్లు..

తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి తమ సొంత వాహనాలపై వచ్చిన భక్తుల కార్లతో కొండ దిగువన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కుమ్మరిపాలెం వైపు నుంచి కొండపైపునకు కార్లు, ఇతర రవాణా వాహనాలను పోలీసులు అనుమతించలేదు. మరో వైపున సీతమ్మ వారి పాదాలు, ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి వచ్చిన కార్లతో హెడ్ వాటర్ వర్క్స్ పరిసరాలు కిటకిటలాడాయి. కొండ దిగువన తమ కార్లను నిలుపుకుని దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకున్నారు. హెడ్‌వాటర్ వర్క్స్‌తో పాటు సీతమ్మ వారి పాదాలు, కెనాల్‌రోడ్డు, వీఎంసీ కార్యాలయం, ఇరిగేషన్ స్థలాలు కార్లు, ద్విచక్రవాహనాలతో నిండిపోయింది.

డివైడర్ ఎక్కిన బస్సు

కూలీలకు తప్పిన పెనుప్రమాదం



డివైడర్‌పై ఎక్కిన బస్సు

నాదెండ్ల: కూలీలతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ మినీ బస్సుకు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. వివరాల్లోకి వెళితే.. యడ్లపాడు మండలంలోని ఎస్‌ఎస్‌ఎల్ నూలుమిల్లులో పనిచేసే కార్మికులు 15 మంది విధులు ముగించుకుని తిరిగి చిలకలూరిపేటలోని తమ నివాసాలకు వెళ్లేందుకు ట్రావెల్స్ మినీ బస్సులో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చిలకలూరిపేటలోని జనతా పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చే సరికి డ్రైవర్ అజాగ్రత్త వల్ల బస్సు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. ఇంజిన్ ఆగిపోవడంతో బస్సు డివైడర్‌పైనే నిలిచిపోయింది. ఏమాత్రం పక్కకు ఒరిగినా పెనుప్రమాదం జరిగేదని కార్మికులు చెబుతున్నారు. స్థానికులు బస్సులోంచి కూలీలను దించి మరో వాహనం ఎక్కించి ఇళ్లకు పంపించారు.

ర్యాంకులు మెరిసాయి

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గుంటూరు విద్యార్థులకు టాప్ ర్యాంకులు
- ఓపెన్ కేటగిరీలో 50, 62వ ర్యాంకులు కైవసం
- ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తామన్న ర్యాంకర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గుంటూరు విద్యార్థులు అఖిల భారతస్థాయిలో సత్తా చాటారు. ఓపెన్ కేటగిరీలో టాప్–100 ర్యాంకుల్లో రెండు ర్యాంకులను కైవసం చేసుకుని విజేతలుగా నిలిచారు. దేశంలోని ఐఐటీల్లో ప్రవేశం కోసం గత నెలలో జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 50వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 62వ ర్యాంకు సాధించారు. వీరితోపాటు వివిధ కేటగిరీల్లో మెరుగైన ర్యాంకులను సాధించిన విద్యార్థులు ఉన్నారు. గత జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండు సెషన్లలో జరిగిన జేఈఈ మెయిన్స్ రాసి జతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులు ఐఐటీలో చదివే లక్ష్యంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురి పెట్టి విజయం సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్న విద్యార్థులంతా ఐఐటీలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) బ్రాంచ్‌లో సీటు సాధించడమే లక్ష్యంగా ఉన్నారు.

ప్రణాళికతో సన్నద్ధమైతే విజయం



మా స్వస్థలం కర్నూలు. నాన్న రామేశ్వర్‌రెడ్డి స్కూల్ బ్యాగులు కుడతారు. అమ్మ అరుణ గృహిణి. 6వ తరగతి నుంచి గుంటూరులోని జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నా. జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో 50వ ర్యాంకు వచ్చింది. ఈ ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరతాను. కోడింగ్ నేర్చుకుని. యాప్ డిజైనింగ్ ద్వారా నూతన ఆవిష్కరణలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, 50వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీ

రైతు కుటుంబం నుంచి వచ్చా



మా స్వస్థలం నెల్లూరు జిల్లా దగదర్తి మండలం. నాన్న నాగరాజు రైతు. అమ్మ లక్ష్మి గృహిణి. 6వ తరగతి నుంచి గుంటూరులో హాస్టల్ క్యాంపస్‌లో ఉంటూ చదువుతున్నాను. ఓపెన్ కేటగిరీలో 378వ ర్యాంకు సాధించాను. ఓబీసీ కేటగిరీలో 52వ ర్యాంకు వచ్చింది. ముంబై, చెన్నై ఐఐటీలో సీఎస్ఈలో చేరాలని ఆశగా ఉంది.

– కడప చైతన్య, 52వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీ

ముంబై ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధనే లక్ష్యం



మా స్వస్థలం గుంటూరు. నాన్న కృష్ణమోహన్ వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ జ్యోతి గృహిణి. పదో తరగతి వరకు ఐసీఎస్ఈ సిలబస్‌లో చదివా. ఐఐటీకి ఎటువంటి ఫౌండేషన్ లేదు. రెండేళ్ల ఇంటర్ చదువుతోపాటు ఐఐటీకి ఇచ్చిన శిక్షణతోనే జేఈఈ మెయిన్స్ రాసి, 18వ ర్యాంకు సాధించాను. కాలేజీలో డైలీ, వీక్లీ టెస్టులు రాయడం ద్వారా ఎప్పటికప్పుడు పొరపాట్లను దిద్దుకుంటూ వచ్చాను. అధ్యాపకులు ఇచ్చిన సూచనలు పాటించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా మెరుగైన ర్యాంకు సాధించా. పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో అధ్యాపకుల సహకారం మరువలేనిది. డైలీ, వీక్లీ టెస్టుల ద్వారా ఎప్పటికప్పుడు సబ్జెక్టు పరమైన నాలెడ్జ్‌ను అభివృద్ధి పరచుకోవడంతోపాటు ఎక్కడ వెనుకబడినదీ తెలుసుకుని, సరి చేసుకోవడం ఎంతో ముఖ్యం. అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకుతో ముంబై ఐఐటీలో సీఎస్ఈ చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఎం.జిష్ణుసాయి, 62వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీ

తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే



మా స్వస్థలం నెల్లూరు జిల్లా కందుకూరు. అమ్మ సుధాలక్ష్మి, నాన్న నర్సింహం. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయలుగా పని చేస్తున్నారు. 6వ తరగతి నుంచి గుంటూరులోనే ఉండి చదువుకుంటున్నాను. ఓపెన్ కేటగిరీలో 3,577వ ర్యాంకు వచ్చింది. ఎస్సీ కేటగిరీలో 86వ ర్యాంక్ సాధించా. అధ్యాపకుల గైడెన్స్ మెరుగైన ర్యాంకు సాధనకు దోహదం చేసింది. ఢిల్లీ ఐఐటీలో సీఎస్ఈలో చేరాలనే లక్ష్యంతో ఉన్నాను.

– డి.భరత్‌చంద్ర, 86వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీ

సీఎస్ఈలో సీటు సాధిస్తాను



మా స్వస్థలం గుంటూరు నగరంలోని సాయి బాబారోడ్డు. నాన్న హరిబాబు వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ విజయలక్ష్మి గృహిణి. మెయిన్స్‌లో ఈడబ్ల్యూఎస్‌లో 50, ఓపెన్ కేటగిరీలో 503వ ర్యాంకు సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో జాతీయస్థాయిలో 509వ ర్యాంకు పొందాను. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 43వ ర్యాంకు సాధించాను. తాజా ర్యాంకులతో ఐఐటీ ముంబై, చెన్నైలో సీఎస్ఈలో సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాను.

– కె.హర్షిత, 43వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ వారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతోపాటు శుభకార్యాలు ఉండటంతో ఆదివారం అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ నుంచి వందల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. ఆలయం చుట్టూ కాకుండా గ్రామంలో ఎక్కడ చూసినా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. దర్శనం అనంతరం మునేరు అవతల మామిడి తోటల్లో సందడి చేస్తూ వంటలు వండుకుని భోజనాలు చేశారు.

తిరుపతమ్మ సేవలో జిల్లా జడ్జి..

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని ఆదివారం ఉమ్మడి జిల్లా జడ్జి అరుణసారిక, జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఎస్ఐ పి.రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ కార్యదర్శిగా నాగరాజు



తెనాలి: జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కోస్తాంధ్ర అధ్యక్షుడు, తెనాలికి చెందిన పల్నాటి నాగరాజు ఆ సంస్థ జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. విశాఖపట్నంలోని గాజువాకలో గల ఎన్‌హెచ్‌ఆర్‌సీ పరిపాలన కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి కౌన్సిల్ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంపత్ కుమార్ ఈ నియామకం చేసినట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వారికి పదోన్నతులు కల్పిస్తున్నట్టు జాతీయ అధ్యక్షుడు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పల్నాటి నాగరాజు తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి స్వప్న, జాతీయ ముఖ్య కార్యదర్శి కిశోర్, జాతీయ అదనపు కార్యదర్శి రాజు, జాతీయ కార్యదర్శి అడ్మినిస్ట్రేషన్ విభాగం మురళి, జాతీయ ఉపాధ్యక్షులు బుల్లెట్ రవి, రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులు ఆయన పాల్గొన్నట్టు వివరించారు.

వైభవంగా పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవం



నెహ్రూనగర్: పునీత ఆంథోని పుణ్యక్షేత్రం 34వ వార్షికోత్సవాన్ని నగరంపాలెంలోని చర్చి ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతి రెవరెండ్ బిషప్ చిన్న బత్తిన భాగ్యయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వాసుల కోరికల్ని తీర్చే అద్భుతాల ఆంథోని వారి వార్షికోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకంగా ఉందని తెలిపారు. 34 ఏళ్లుగా కథోలిక విశ్వాసుల కోరికల్ని తీరుస్తూ పునీత ఆంథోని భక్తుల నీరాజనాల్ని అందుకుంటున్నారని పేర్కొన్నారు. ముందుగా పురవీధుల్లో ఆంథోని వారి తేరు ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు క్రైస్తవ గీతాలాపన చేశారు. వేడుకలకు పుణ్యక్షేత్ర విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో ఫాదర్లు పిల్లి ఆంథోని, చిన్నయ్య, రాజారెడ్డి, ఇన్నారెడ్డి, గోవింద రాయన్న, సంఘ పెద్దలు ఎస్. ప్రకాశరావు, జేజే సుధీర్ బాబు, కతోలిక విశ్వాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటికలు

పొన్నూరు: ప్రముఖ రంగస్థల నటుడు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై నిర్వహిస్తున్న 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో భాగంగా ఆదివారం హైదరాబాద్ కళాంజలి సంస్థ నిర్వహణలో 'రైతేరాజు' సాంఘిక నాటిక ప్రదర్శించారు. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్న సెల్‌ఫోన్ లేకపోయినా బతకవచ్చు గానీ రైతు లేకపోతే బతకలేమనే సారాంశాన్ని కళాకారులు తెలియజేశారు. కంచర్ల సూర్యప్రకాష్ రచనకు, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. చిలుకలూరిపేట ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్ నిర్వహణలో 'ఏడ నున్నాడో ఎక్కడున్నాడో' సాంఘిక నాటిక ప్రదర్శించారు. ఆస్తి కోసం మేనకోడలిని వివాహమాడాలని చూసిన మేనమామ దుర్బుద్ధిని బయటపెడుతూ సాగిన నాటిక హాస్యభరితంగా ఉంది. అమెచ్యూర్స్ యూనిట్ రచనకు, షఫీ దర్శకత్వం వహించారు. కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ 'కౌసల్య సుప్రజా రామా' నాటికను ప్రదర్శించారు. అమ్మ మనసు బిడ్డల కష్టాలు, కన్నీళ్లకు ఎల్లప్పుడూ ఓదార్పుగా ఉంటుందనే సారాంశాన్ని తెలియ జేసింది ఈ నాటిక. ఆకెళ్ల శివప్రసాద్ మూల కథకు, స్నిగ్ధ నాటకీకరణకు, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు, బహుమతులు అందించి సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు ఎస్. ఆంజనేయులు నాయుడు, గౌరవాధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్. శివకుమార్. కోటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్.వి. రామకృష్ణారావు పర్యవేక్షించారు.



కౌసల్య సుప్రజా రామా నాటికలోని సన్నివేశం



రైతేరాజు నాటికలోని సన్నివేశం



ఏడనున్నాడో ఎక్కడున్నాడో నాటికలోని సన్నివేశం

ఎవరు మమ్మల్ని అడిగేది?

- హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని టీడీపీ నేతలు
- మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారానికి పసుపు రంగు

నరసరావుపేట: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించగానే అంతా పసుపుమయంగా మారిపోతోంది. కూటమి శ్రేణులు కూడా ఎవరు మమ్మల్ని అడిగేది? అన్నట్టు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వ ఛాయల్ని కన్పించనీయకుండా చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకు పార్టీ రంగులు వేయకూడదని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇంకా ప్రభుత్వం ఏర్పడకుండానే తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు కూడా ఆపే ప్రయత్నం చేయట్లేదు. ఇప్పటికే సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం (డీఎస్‌ఏ) ప్రవేశద్వారానికి టీడీపీ వర్గీయులు పసుపు రంగు వేశారు. తాజాగా ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారానికి కూడా పార్టీ రంగు వేశారు. యార్డు చైర్మన్, కమిటీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ వ్యక్తులు వ్యవహరిస్తున్నారు. వారి అనుమతి తీసుకోకుండా, తీర్మానం లేకుండానే పసుపు రంగు వేయడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు.



మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారం

వాణిజ్య సముదాయంలో షాపులపై కన్ను

ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డుకు చెందిన వాణిజ్య సముదాయంలోని షాపులపై టీడీపీ, జనసేన వర్గీయులు కన్ను వేశారు. కింది భాగంలో 16, పై భాగంలో 11 షాపులు ఉన్నాయి. కింది భాగంలో ఉన్న వాటికి గిరాకీ బాగా ఉంది. వాటిలో పలువురు వ్యాపారులు గత ఐదేళ్ల నుంచి వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం చేస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించగానే కొందరు వ్యక్తులు పార్టీల వారీగా ఈ షాపు నీది.. ఆ షాపు నాది అంటూ పంచేసుకున్నట్లు సమాచారం. త్వరగా ఖాళీ చేసి తమకు అప్పగించాలని యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు భోగట్టా. దీనిపై కోర్టుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

17న ఆలయ భూముల కౌలు వేలం

గోవాడ(వేమూరు): అమర్తలూరు మండలంలోని గోవాడలో ఉన్న శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానం మాగాణి భూముల కౌలు వేలం పాటను ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ఆలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈవో అశోక్‌రెడ్డి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితికి గానూ నిర్వహించు పాటలో పాల్గొన దలచినవారు ప్రతి ఐటానికి రూ. 5 వేలు చొప్పున ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు. ప్రథమ ఐటంగా శ్రీ దేవస్థానం భూమి 3.85 ఎకరాలు, రెండవ ఐటంగా 2 ఎకరాలకు పాట నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

15నుంచి ఏలూరులో రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

తెనాలి: రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు ఈనెల 15,16,17 తేదీల్లో ఏలూరులోని టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరగనున్నాయని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 15వ తేదీ ఉదయం 11 గంటలకు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షతన ప్రారంభమయే సభల్లో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య స్వాగతోపన్యాసం, ఏఐకేఎంకేఎస్ కన్వీనర్ సుబోధ్ మిత్ర ప్రారంభోపన్యాసం చేస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు, అనంతరం బహిరంగ సభ ఉంటాయన్నారు. 16న సదస్సును కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 'వ్యవసాయరంగ సంక్షోభం-పాలకుల విధానాలు' అంశంపై నల్లమడ రైతు సమితి నాయకుడు కొల్లా రాజమోహన్, 'అటవీ హక్కులు-పునరావాసం'పై సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, 'భూమి సమస్య-సామాజిక అంశం'పై దళిత బహుజన నేత వై.కోటేశ్వరరావు ప్రసంగిస్తారని వివరించారు. 17న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. ఈ మహాసభల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిషా, బీహార్, ఝార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్నుంచి ప్రతినిధులు హాజరవుతారని వివరించారు.

ఉరి వేసుకొని కూలీ మృతి

మేదరమెట్ల: గ్రానైట్ కంపెనీలో కూలీగా పని చేస్తున్న బిహార్ చెందిన వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. శనివారం కేసు నమోదు చేసినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు. బిహార్ రాష్ట్రం బెగుసరాయ్ జిల్లా భగవాన్‌పూర్ థానా బనారా గ్రామానికి చెందిన గౌతమ్‌కుమార్ (24) ఈనెల ఒకటో తేదీన పనికోసం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలో ఉంటున్న బాబాయి పిల్లల వద్దకు వచ్చాడు. గ్రానైట్ కంపెనీలో పనికి వెళ్లి వస్తుంటాడు. అదే క్రమంలో శుక్రవారం ఉదయం గదిలో ఉంటున్న మిగిలిన వారితో పాటు గౌతమ్ కుమార్ కూడా పనికి వెళ్లాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో తిరిగి వచ్చిన వారు గది తలుపులు తీసుకొని లోనికి రాగా అప్పటికే గౌతమ్‌కుమార్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో మేదరమెట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్య జరిగిన తీరును పరిశీలించారు. అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి శనివారం ఉదయం ఇరుగు పొరుగు వారిని విచారించారు. మృతుడు ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాడని ఏమి జరిగిందో తెలియదు కానీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న గౌతమ్‌కుమార్‌ను పరిశీలిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

దివ్యాంగుల చదరంగ జట్టు ఎంపికలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. చెస్ అసోసియేషన్ ఫర్ విజువల్లీ చాలెంజెడ్ ఆంధ్రప్రదేశ్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఏపీ, తెలంగాణ రాష్ట్ర స్థాయి చదరంగ జట్టు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. సమర్థనం దివ్యాంగుల సంస్థ గుంటూరు శాఖ సహకారంతో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదరంగం ఆడుతున్న దివ్యాంగుల్ని అభినందించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల ఉన్నతికి కృషి చేస్తున్న సమర్థనం సంస్థ సేవల్ని కొనియాడారు. జట్టు ఎంపికల కార్యదర్శి సీహెచ్. కుమార్ రాజా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఎంపిక పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 21 మంది, తెలంగాణ నుంచి 10 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఆగస్టులో జరగనున్న సౌత్ జోన్ టోర్నమెంటుకు పంపుతామని తెలిపారు. రామసేతు పెయింట్స్ అండ్ హార్డ్‌వేర్ అధినేత పి.సుధాకర్, సమర్థనం దివ్యాంగుల సంస్థ ప్రతినిధి డాక్టర్ పరమహంస, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్‌రెడ్డి, కోశాధికారి ఎం.ప్రసన్నకుమార్, ఆర్బిటర్ గోపీనాథ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గళ్లా మాధవికి జ్ఞాపికను అందిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు

ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్తున్న ఎస్టీయూ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నేడు అదే ఉద్యమస్ఫూర్తితో ముందుకు వెళుతోందని ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసఫ్ సుధీర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్ వద్ద సంఘ ఏపీ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించిన జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ 1946 మే 7న ఆవిర్భవించిన ఎస్టీయూ 1947 జూన్ 9న అధికారిక గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో వ్యవస్థాపక శాశ్వత సభ్య సంఘంగా ఉందని వివరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు వివిధ సదుపాయాల కల్పనపై ప్రభుత్వంతో పోరాడి సాధించడంలో ఎస్టీయూ విశేష కృషి చేసిందని తెలిపారు. పోరాటాలు, త్యాగాలకు పుట్టినిల్లు వంటి ఎస్టీయూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమిస్తూ ముందుంటుందని పేర్కొన్నారు. సంఘ ఉద్యమ నేతలు మగ్దూం మొహిద్దీన్, పి.వి.రాఘవాచారి, వీణా విజయరామరాజు, పి.శ్రీరామమూర్తి త్యాగం మరువలేనిదని కొనియాడారు. సంఘ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ షేక్ బాజీ, డీఏ జోసఫ్, ఆర్థిక కార్యదర్శి ఎల్.వీరాంజనేయులు, జిల్లా సీనియర్ నాయకులు పి. శ్రీనివాసరావు, పి.ప్రసాద్, రాజేష్, సుందరం, ఎం.పి.సుబ్బారావు, డేవిడ్ రాజు, ఎం. శ్రీనివాసరావు, కృష్ణ కిశోర్, జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జోసఫ్ సుధీర్‌బాబు

టాప్ ర్యాంకర్లకు భాష్యం నగదు పురస్కారాలు



గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 50వ ర్యాంకు సాధించిన ఎం. సాయి యశ్వంత్‌రెడ్డి, 62వ ర్యాంకు సాధించిన ఎం.జిష్ణు సాయికి భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ రూ.ఐదు లక్షలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వివిధ ర్యాంకులను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఓపెన్ కేటగిరీలో 50, 62వ ర్యాంకులను కైవసం చేసుకున్న ఇద్దరు విద్యార్థుల్ని వారి తల్లిదండ్రులతో పాటు సన్మానించారు. అనంతరం విద్యార్థుల ఉన్నత చదువుల కోసం భాష్యం విద్యాసంస్థల తరపున చెరొక రూ.ఐదు లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. గతేడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 5, 10వ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సైతం ఇదే విధంగా ఉన్నత చదువుల కోసం నగదు ప్రోత్సాహకాల్ని అందజేసినట్లు భాష్యం రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో భాష్యం డైరెక్టర్ హనుమంతరావు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అపర సంజీవని అల్ల నేరేడు

- సర్వరోగ నివారిణి
- కాయ నుంచి చెట్టు బెరడు వరకు ఔషధ భాండాగారం
- మార్కెట్‌లో డిమాండ్

కారంచేడు: రక్తాన్ని శుద్ధి చేసి, ఔషధ విలువలు, పోషకాల ఇచ్చే నేరుడు పండ్ల సీజన్ వచ్చేసింది. తినడానికి ఇవి కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉంటాయి.. జంబూఫలం, జామూన్‌గా కూడా పిలుస్తారు. నేరడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనీగా పిలుస్తారు. ఈ పండ్లలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. ఆక్సాలిన్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది. చిత్తూరు, కృష్ణా, తూర్పుగోదావరి వంటి జిల్లాల్లో ఎక్కువగా ఉంటాయి. అక్కడి నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో అమ్ముతుంటారు.వీటిలో నాటు పండ్ల కంటే హైబ్రిడ్ రకానికి గిరాకీతో పాటు ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తుతం కేజీ రూ.150-170 వరకు ఉంటే హైబ్రిడ్ కేజీ రూ.200-250 వరకు డిమాండ్‌ను బట్టి అమ్మకాలు చేస్తున్నారు. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలు.. ఇలా నేడు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. వీటన్నింటి నివారణకు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అయితే, సహజ సిద్ధమైన నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాల్ని ఇస్తుంది.



ఉపయోగాలు

- శరీర భాగాల్లో గాయాలయితే నేరుడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- చెట్టు ఆకులు విషాన్ని కూడా పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి.
- పొట్టలో ఉండే నులిపురుగులును ఈ నేరేడు నివారిస్తుంది. నోటి కేన్సర్ నివారణకు కూడా ఎంతో దోహదపడుతుంది.
- మధుమేహ వ్యాధి పీడుతులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడి చేసుకొని ప్రతి రోజు వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడేవారికి ఉపయోగపడుతుంది.
- నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని రోజూ పుక్కిలిస్తే ఉపశమనం కలుగుతుంది.
- నోటిలోని చిన్న పూతలు వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు చాలా మంచి ఔషదం.
- గర్భిణులు ఈ పండ్లను తినకూడదు.
- ప్రతి ఒక్కరు ఏడాదికి కనీసం 20 పండ్లు తింటే మంచి ఫలితాలుంటాయి.

పండ్లలో ఎన్నో విశిష్టతలు



నేరేడు కాయాల్ని తినడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. పండుకు విషాన్ని హరించే శక్తి సైతం ఉంది. శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకుల రసాలనే ఎక్కువగా వినియోగించేవారు.

–డాక్టర్ కృష్ణకుమార్, ఆయుర్వేద వైద్యుడు, దగ్గుబాడు

జిల్లా కలెక్టర్‌గా శివశంకర్‌ను కొనసాగించాలి

నరసరావుపేట: జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్‌గా లోతేటి శివశంకర్‌ను నూతన ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ కోరారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లకు పైగా కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్‌ను ఎన్నికల పోలింగ్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యుల్ని చేస్తూ ఎన్నికల కమిషన్ పక్కన పెట్టిందన్నారు. అయితే, ఆయన కలెక్టర్‌గా జిల్లాలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. మరి కొన్నాళ్లు ఆయన కొనసాగితే ఆయా వర్గాలు సామాజికంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే తాము జిల్లాలో పలు నియోజకవర్గాలకు నూతన ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిని కూడా కలసి కోరినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ సెల్ అధ్యక్షుడు వట్టిపు మరియదాసు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్ శిక్షణ



సర్టిఫికెట్లతో క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నెల రోజుల నుంచి స్థానిక అరండల్‌పేటలోని శివాజీ క్రీడా మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులు ఎంతో ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారన్నారు. ప్రతి రోజూ సాధన చేయాలని ఆయన సూచించారు. అనంతరం చిన్నారులకు ప్రసాద్, ప్రవీణ్, కిశోర్‌లు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.